గతుకుల రోడ్డుకు అతుకులు

- గుంతలతో ఆర్‌అండ్‌బీ రోడ్లు
- తూతూ మంత్రంగా గుంతల పూడిక పనులు
- ఎర్రమట్టితో గుంతలు పూడ్చుతున్న వైనం
- మళ్లీ గుంతలు పడుతున్నాయని ఆందోళన
- గుంతల్లో పడి మృత్యువాత పడుతున్న వాహనదారులు


పర్దీపురం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఎర్రమట్టితో పూడ్చిన గుంతలు

శాంతినగర్: అసలే రద్దీగా ఉండే ప్రధాన రహదారులు. రెండు, మూడు రాష్ట్రాలను కలిపే డబుల్ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్-రాయచూర్ ప్రధాన అంతర్రాష్ట్ర రహదారి, అయిజ-గద్వాల ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలమయమై అధ్వానంగా మారాయి. రహదారుల్లో స్పీడ్ బ్రేకర్ల కంటే గుంతలు, అడ్డంగా తవ్విన పైప్‌లైన్ల గోతులే దర్శనమిస్తున్నాయి. దీంతో తరచూ వాహనాలు అదుపుతప్పడం, విరిగిపోవడం, ప్రమాదాల బారిన పడుతూ వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు-కలుకుంట్ల, వెంకట్రామనగర్-జూలెకల్, పర్దీపురం-ఉప్పల రోడ్ల మధ్య తరచు ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. ప్రమాదాల్లో వాహనదారులు మృత్యువాత పడటమేగాకుండా వాహనాలు నుజ్జునుజ్జవుతున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలకు బీటీతో మరమ్మతులు చేయించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ఆయా మండలాలకు చెందిన వాహనదారులు కోరుతున్నారు.


మట్టి రోడ్డును తలపిస్తున్న అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారి

గుంతలు సరిగా పూడ్చలేదు



శాంతినగర్ నుంచి అలంపూర్ చౌరస్తా వరకు ఉన్న డబుల్ రోడ్డుపై చాలా చోట్ల గుంతలు పడ్డాయి. పైప్‌లైన్లు తవ్వే సమయంలో అడ్డంగా గోతులు ఏర్పడ్డాయి. మూడు, నాలుగు గుంతలకు కంకర, సిమెంట్‌తో కూడిన మాల్ వేశారు. నాలుగు రోజులకే కంకర తేలి గుంతలు దర్శనమిస్తున్నాయి. తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– కలీముల్లా, శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

ఎర్రమట్టితో నింపితే ఉంటుందా?



వేలకొలది వాహనాలు, భారీ వాహనాలు తిరిగే అలంపూర్-రాయచూర్ రోడ్డుపై పడిన గోతులను ఎర్రమట్టితో నింపారు. నాలుగు రోజులకే మట్టిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. పర్దీపురం నుంచి అయిజ వరకు గోతుల్లో ఎర్రమట్టి పోసి వదిలేశారు. పర్దీపురం-అయిజ మధ్యలో ఇటీవల నలుగురు చనిపోయారు. గుంతలకు బీటీతో పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– హర్షవర్ధన్, పర్దీపురం, అయిజ

ఇబ్బందులకు గురి చేస్తే సహించం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ

గద్వాల అర్బన్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఫీజుల పేరిట ఇబ్బందులకు గురి చేస్తే సహించబోమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పదో తరగతి విద్యార్థులకు సకాలంలో హాల్ టికెట్లు అందజేయాలని, లేదంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, హనుమేష్, రాఘవ, అంజి, నరేష్ ఉన్నారు.

విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో మంగళవారం విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహ హాజరై రైతులకు విత్తన కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఏదైనా షాపులో విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా షాపు ఒరిజినల్ రశీదు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లపై బ్యాచ్ నెంబర్, తయారు తేదీ, గడువు, తయారీ, మార్కెటింగ్ కంపెనీల పూర్తి వివరాలు, తదితర అంశాలను తప్పని సరిగా పరిశీలించాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలను రైతులు తమ పొలంలో విత్తుకున్నాక అట్టి ఖాళీ సంచులను, వాటి రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు కూడా భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

హైదరాబాద్ తరలిన బీజేపీ శ్రేణులు


ఎర్రవల్లి నుంచి తరలి వెళ్తున్న బీజేపీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని విజయ సంకల్ప సమ్మేళనానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల, బూత్ కమిటీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో వాహనాల ద్వారా తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మానిక్యారెడ్డి, రాజేష్, మద్దిలేటి, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, వెంకటేష్, మహేష్, వీరేష్, రమేష్, పరమేష్ ఉన్నారు.

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ నేతలు హైదరాబాదుకు తరలి వెళ్లారు. గట్టు నుంచి బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. గట్టుకు చెందిన గూడూరు బస్వరాజు, కిట్టుస్వామి, బెల్లం నర్సింహులుతో పాటుగా వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు


జల్లాపురంలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మానవపాడు: విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య అత్యంత కీలకమైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ వ్యక్తి అయినా జీవితంలో ఉన్నతస్థాయి చేరుకోవాలంటే 10వ తరగతి కీలకమన్నారు. 10వ తరగతి తర్వాత ఆ విద్యార్థికి ఉన్నటువంటి ఆకాంక్షను బట్టి ఉన్నత విద్యకు మార్గం ఏర్పడుతుందని సూచించారు. ఆనవాయితీగా పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

అయిజ: మండలంలోని ఉత్తనూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరూరు: నిత్య జీవితంలో ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలని జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం ఇండియన్ అపర్ ప్రైమరి పాఠశాలలో మంగళవా రం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చాంద్, నర్సింహులు మాట్లాడారు.

పేకాట స్థావరంపై దాడి

గట్టు: మండలంలోని ఆలూరులో మంగళవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఆలూరు శివారులో గుట్టుగా పేకాడుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీస్ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇందులో కొంత నగదును స్వాధీనం చేసుకుని 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

ఎర్రవల్లిచౌరస్తా: సీడ్ కంపెనీకి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ చోరీకి గురైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ స్వాతి కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని వేముల స్టేజీ సమీపంలో సీడ్ కంపెనీకి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు 40 లీటర్ల ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల అపహరించారు. దీనివల్ల ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో కంపెనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సీడ్ కంపెనీ అధికారి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి స్వల్ప గాయాలు

అయిజ: మున్సిపాలిటీ సమీపంలోని తుపత్రాల గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని కారు అదుపుతప్పి పక్కనున్న గోతిలో పడింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ వ్యక్తి కారులో నుంచి బయటకు వచ్చి ఇతర వాహనంలో వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈనెల 5న తుపత్రాల సమీపంలో కర్ణాటకకు చెందిన కారు టైరు పగిలి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యా యి. అయిజ-పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడం వల్లనే ఈ రోడ్డుపై ప్రమాదాలు చో టుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో నెహ్రూనగర్‌కు చెందిన తెలుగు శ్రీనివాసులు స్థలంలో గ్రామానికి చెందిన కన్యాదార శాంతి, మురళీధర్‌రెడ్డిలు మట్టిని పోసి తమను ఇబ్బంది పెడుతున్నారని ఎంపీడీఓ కార్యాలయం ముందు బాధితులు నిరసన చేపట్టారు. గ్రామంలో రోడ్డు వేయిస్తామని తమ స్థలంలో మట్టిని తరలించినట్లు తెలిపారు. తెలుగు శ్రీనివాసులు, రాములమ్మ దంపతులు, వారి తల్లితండ్రులు వెంకటేశ్వరమ్మ, గాంధీలు, అతని భామ్మర్దులు ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

గద్వాల క్రైం: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్దప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని సుంకుమ్మమెట్టు కాలనీలో క్షయ వ్యాధి అంశంపై ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. క్షయ వ్యాధి లక్షణాల్లో ముఖ్యంగా స్పర్శ లేకుండా, ఎర్రని రాగి లేదా గోధుమ రంగు కలిగిన మచ్చలు ఉంటాయని తెలిపారు. కాళ్లు, చేతుల్లో తిమ్మిళ్లు రావడం, చేమట రాకపోవడం తదితర లక్షణాలు ఉన్నట్లయితే దగ్గర్లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులకు చూయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం, వారి స్థితిగతులను గుర్తించేందుకు సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజు, మల్లికార్జున్, ప్రేమ్‌సాగర్, సిబ్బంది నర్సమ్మ, లక్ష్మీదేవి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.



క్లుప్తంగా

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గట్టు: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఇంటర్ బోర్డు స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం భౌతిక శాస్త్రం, ఎకనామిక్స్‌తో పాటుగా ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 323 మంది విద్యార్థులకు గాను, 322 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు.

అయిజ: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హరిహర, హారోరా కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్ 2 పరీక్షలకు 804 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారైనట్లు నోడల్ ఆఫీసర్ హృదయరాజు పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచండి

మానవపాడు: మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజలకు కూలి పనులు కల్పించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. మంగళవారం అమరవాయి, మానవపాడు గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. నర్సరీలను పరిశీలించారు. రోడ్ల వెంట నాటిన హరితహారం మొక్కలకు నీటిని అందించాలని సూచించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

రాజోళి: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు అన్ని వసతులు కల్పించాలని కేవీపీఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. వేసవికాలం కావడంతో ఎండలు ముదురుతున్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, టెంట్ తదితర ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి డీఎస్సీ(ఎస్.జీ.టీ) ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించరాదన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డైట్, టెట్ మార్కుల మోమెలు, ఆధార్ కార్డు, కులం, ఆదాయం ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఎస్‌జీటీ సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08546-293022, 9908560268 నంబర్లకు లేదా జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైష్ణవిని అభినందించిన జెడ్పీసీఈఓ



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకు చెందిన వైష్ణవి కరాటే, కూచిపూడి రంగంలో అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించింది. దీంతో విద్యార్థినిని జెడ్పీసీఈఓ సుధారాణి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని అభినందించి షీల్డు, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ మహిళా అధికారులు పాల్గొన్నారు.

వనపర్తికి తరలిన కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని వనపర్తి జిల్లా కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చేపట్టిన పాదయాత్రకు ఉమ్మడి ఇటిక్యాల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో వాహనాల ద్వారా పాదయాత్రకు తరలి వెళ్లారు.

జయప్రదం చేయండి

గద్వాల అర్బన్: ఢిల్లీలో 17రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 14న నిరసన చేపట్టనున్నట్లు రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నిరసనలో జిల్లాలోని వివిధ ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సత్యారెడ్డి, ఆశన్న, రామరాజు తదితరులు ఉన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ఈ నెల 4వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు'అనే శీర్షకతో కథనం ప్రచురితమైంది. మంగళవారం స్పందించిన విద్యుత్ అధికారులు విద్యుత్ తీగలను తొలగించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.


చెన్నిపాడులో విద్యుత్ తీగలను సరిచేస్తున్న విద్యుత్ అధికారులు

కొలతల ప్రకారం చేస్తేనే కూలి వస్తుంది

- డీఆర్‌డీఓ పీడీ నర్సింగరావు

శాంతినగర్: ఈజీఎస్ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ఎక్కువ కూలి వస్తుందని డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింగరావు అన్నారు. వడ్డేపల్లి మండలం జూలెకల్ పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను, నర్సరీలను పీడీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ఉదయం తొందరగా వచ్చి ఎండ పడే లోగా పనులు చేసుకుని వెళ్లాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. పీడీ వెంట ఎంపీడీఓ రమేషకుమార్, ఏపీఓ కుమార్, ఏపీఎం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ నర్సింగరావు

ఆరు గ్యారంటీలను అందించడమే లక్ష్యం

మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్, కృష్ణయ్య, రామనాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీ ఇచ్చిందని, వాటిలో ఇప్పటికే ఐదు అమలు చేశారన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, చేయూత ద్వారా ఆరోగ్య శ్రీ కింద రూ.10లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లకల్లు, కృష్ణరాజు, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.


చిన్నపోతులపాడులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గద్వాల అర్బన్: స్త్రీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం, మహిళా రక్షణ కోసం పాటుపడదామని, మహిళల హక్కులను కాపాడుకుందామని, మహిళల పోరాట స్ఫూర్తితోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, నాగప్రమీల, పాంగుటమ్మ, శ్రీదేవి, లక్ష్మీకాంతమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

భూముల సమస్యలు పరిష్కరించండి

శాంతినగర్: ఇనాం భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఎంఐఎం పార్టీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కలీముల్లా ఆర్డీఓను కోరారు. జోగుళాంబగద్వాల జిల్లా ఆర్డీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామచందర్‌కు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇనాం భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఆర్డీఓ స్పందించారని ఆయన తెలిపారు.


ఆర్డీఓ రామచందర్‌ను సన్మానిస్తున్న ఎంఐఎం పార్టీ నాయకులు

పశువులకు టీకాలు వేయించండి


వెంకటాపురంలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ స్వరూపారాణి

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, భూంపురం గ్రామాల్లో పశువులకు సిబ్బందితో వ్యాక్సిన్ వేయించారు.

శాంతినగర్: వర్షాకాలంలో పశువుల గిట్టలకు గాలికుంటు వ్యాధి సోకుతుందని, ఉచితంగా వేస్తున్న గాలికుంటు నివారణ టీకాలు పశువులకు ముందుగా వేయిస్తే వ్యాధి బారిన పడవని డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లిలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 17మంది రైతులకు చెందిన 162 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

గద్వాల అర్బన్: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని న్యాయవాది వరలక్ష్మీదేవి అన్నారు. జిల్లా నేనేకా గ్లోబల్, పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ వారి సహకారంతో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహంలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వార్డెన్ ప్రమీల, ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, సంస్థ సభ్యులు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.50వేలు ఎత్తుకెళ్లిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గద్వాల పట్టణంలోని నది అగ్రహారం కాలనీకి చెందిన అశోక్ మంగళవారం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో బయటకు వచ్చాడు. ఈ క్రమంలో తాళం వేసిన ఇల్లును గమనించి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో రూ.50వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.